
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 30 ఆగస్టు 2024



# తాగునీటి సమస్యకు పరిష్కారం

**శివారు ప్రాంతాలకు రూ.550 కోట్ల వ్యయంతో పైప్‌లైన్**

- కణితి రిజర్వాయర్ నుంచి ముడసర్లోవ మీదుగా భీమిలి వరకూ ఏర్పాటు
- ప్రతిపాదనలు తయారుచేసిన జీవీఎంసీ
- ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి నిధులు
- ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



నగరం శరవేగంగా విస్తరిస్తోంది. శివారు ప్రాంతాల్లో జనాభా పెరుగుతోంది. దీనివల్ల ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీరు వారి అవసరాలకు సరిపోవడం లేదు. వేసవి సీజన్‌లో అయితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం శివారు ప్రాంతాలైన ఆరిలోవ, మధురవాడ, భీమిలిల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టిసారించింది. అందుకు అనుగుణంగా జీవీఎంసీ అధికారులకు ఆదేశాలు అందడంతో రూ.550 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 75 ఎంజీడీ (మిలియన్స్ గ్యాలన్స్ పర్ డే) నీటిని జీవీఎంసీ సరఫరా చేస్తోంది. ఏలేరు రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా 75 ఎంజీ నీరు గాజువాకలోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుతోంది. అయితే అందులో 15 ఎంజీలు నిల్వ ఉంచి, మిగిలిన 60 ఎంజీ నీటిని నగర వాసులకు తాగునీటి కొళాయిల ద్వారా సరఫరా చేస్తోంది. మరో 15 మిలియన్ గ్యాలన్ల నీటిని రైవాడ, తాటిపూడి, మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ వంటి రిజర్వాయర్ల నుంచి తీసుకొచ్చి పెందుర్తి, ఆరిలోవ, ఎండాడ, మధురవాడ, భీమిలి వంటి శివారు ప్రాంతాలకు సరఫరా చేస్తోంది. కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచే నీటిని నగరంలో సమస్య తలెత్తే ప్రాంతాలతోపాటు పరిశ్రమలకు అదనంగా అవసరమైనపుడు కేటాయించడం చేస్తుంటారు. ఉద్యోగ, వ్యాపార, తదితర అవసరాల నిమిత్తం నగరానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకీ అభివృద్ధి చెందుతుండడంతో శివారు ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. దీంతో ఆరిలోవ, ఎండాడ, మధురవాడ, భీమిలి వంటి ప్రాంతాల్లో జనాభా పెరుగుతోంది. దీంతో గతంలో మాదిరిగా నీరు సరఫరా చేస్తే అక్కడ ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పట్టించుకోలేదు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందుల పరిష్కారంపై దృష్టిసారించింది. నేతల ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు ఏలేరు రిజర్వాయర్ నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరిన నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా ముడసర్లోవకు తరలించాలని, అక్కడ నీటిని శుద్ధి చేసే ప్లాంటు నిర్మించాలని ప్రతిపాదన తయారుచేశారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని పైప్‌లైన్ ద్వారా ఆరిలోవ, ఎండాడ, మధురవాడ మీదుగా భీమిలి వరకూ తరలించేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇందుకు రూ.550 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనను ఇటీవల నగర పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తీసుకువెళ్లారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులను సమకూర్చేందుకు ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తంచేసినందున రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదని అధికారులు వివరించారు. దీంతో చంద్రబాబు సూచన మేరకు ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ఆమోదం కోసం పంపించారు.

## బిజీబిజీగా యువనేత

- ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాసానికి మంత్రి నారా లోకేశ్
- అల్పాహారం అనంతరం ఉమ్మడి జిల్లా నేతలతో ఇష్టాగోష్ఠి
- అక్కడ నుంచి కోర్టుకు...
- సాయంత్రం న్యాయస్థానం వెలుపల మీడియా సమావేశం...
- అనంతరం ఐటీ పారిశ్రామికవేత్తలతో భేటీ

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ బిజీబిజీగా గడిపారు. బుధవారం రాత్రి నగరానికి చేరుకుని పార్టీ కార్యాలయంలో బస చేసిన ఆయన్ను కలిసేందుకు గురువారం ఉదయం పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. అందరితో మాట్లాడి, అక్కడ నుంచి సీతంపేటలో గల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లారు. అల్పాహారం తీసుకున్న అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన నాయకులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అక్కడ నుంచి జిల్లా కోర్టుకు చేరుకున్నారు. 'సాక్షి'పై వేసిన పరువునష్టం దావా కేసులో 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలలోపు కోర్టులో ప్రక్రియ ముగుస్తుందని, తరువాత పార్టీ కార్యాలయంలో కేడర్‌ను కలవాలని భావించారు. ప్రతివాది తరపున న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తికాకపోవడంతో భోజన విరామం ... మిగతా 6వ పేజీలో

## నేడు విద్యా సంస్థల ఆకస్మిక తనిఖీ

- పర్యటనపై గోప్యత

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నగరంలో కొన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను విద్యాశాఖగానీ, ఆయన వ్యక్తిగత సిబ్బందిగానీ బయటకు వెల్లడించలేదు. అంతా గోప్యంగా ఉంచారు. విశాఖ పర్యటనలో భాగంగా పాఠశాలలు తనిఖీ చేయాలని భావించిన లోకేశ్, ఆ వివరాలు వెల్లడించవద్దని పార్టీ వర్గాలకు సూచించారు. అయితే లోకేశ్ తనిఖీ చేసే అవకాశం ఉందని భావించిన కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను విద్యాశాఖ అప్రమత్తం చేసింది.

# ఐటీ రాజధానిగా విశాఖ

**రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటుచేస్తాం**

- సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు



ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

- రాయితీకి భూముల కేటాయింపుపై మంత్రివర్గంలో చర్చిస్తాం
- గత ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తాం
- విశాఖ విమానాశ్రయానికి కనెక్టివిటీ పెంపు




మంత్రి నారా లోకేశ్‌ను సత్కరిస్తున్న ఐటీ పరిశ్రమల నిర్వాహకులు



గురువారం న్యాయస్థానానికి హాజరైన మంత్రి నారా లోకేశ్

- అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తాం
- ఐటీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ భరోసా

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటు చేస్తామని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఐటీ పారిశ్రామికవేత్తలతో ఆయన గురువారం రాత్రి నోవాటెల్ హోటల్‌లో సమావేశమయ్యారు. సుమారుగా రెండు గంటలసేపు సాగిన సమావేశంలో హాజరైన ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించారు. వారు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ మంత్రి ఓపికగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు వివరించారు. గత ఐదేళ్ల ఐటీని ఎవరూ పట్టించుకోలేదని, ప్రభుత్వ పెద్దలు తమను ఏనాడూ దగ్గరకు రానివ్వలేదని, ఇప్పుడు పరిస్థితులు మారినందుకు చాలా సంతోషంగా ఉందని పలువురు పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఐటీ సమస్యల పరిష్కారానికి ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఐటీ పరిశ్రమలకు రాయితీపై భూములు ఇవ్వాలని పలువురు కోరినందున దీనిపై మంత్రివర్గంలో చర్చిస్తామన్నారు. విద్యుత్, ఇతర పన్నుల భారాలపై సమీక్షించి నిర్ణయంతీసుకుంటామన్నారు. విశాఖకు పెద్దసంఖ్యలో ... మిగతా 6వ పేజీలో

### భూ ఆక్రమణలపై విచారణ

- దోషులపై చర్యలు తీసుకుంటాం
- సీబీఎస్ఈ సిలబస్‌పై సమీక్షిస్తాం
- సూపర్‌సిక్స్ అమలుచేస్తాం
- విశాఖ ఉక్కును కాపాడతాం ... మెయిన్ 11లో



కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్‌కు ఐఎన్ఎస్ డేగాలో స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

## కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

- నేవల్ బేస్‌లో 'ఐఎన్ఎస్ అరిఘాత్' జాతికి అంకితం

**గోపాలపట్నం, ఆగస్టు 29:** నగరానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయంలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాజ్‌నాథ్‌సింగ్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నేవల్‌బేస్‌కు వెళ్లారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రెండో అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్'ను జాతికి అంకితం చేశారు. మూడు గంటలకు ప్రత్యేక విమానంలో తిరువనంతపురం బయలుదేరి వెళ్లారు.

## రేపే సామాజిక పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 1,62,841 మందికి రూ.69.99 కోట్లు

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** వచ్చే నెల ఒకటో తేదీ సెలవు కావడంతో ఈనెల 31వ తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సెప్టెంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా కింద 1,62,841 మందికి రూ.69,99,96,000 పంపిణీకి అధికారులు ఏర్పాట్లుచేశారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 27,056 మందికి రూ.11,24,60,500, జీవీఎంసీ పరిధిలో 1,35,885 మంది పింఛన్‌దారులకు రూ.58, 75,65,500 పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం ఐదు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకూ 100 శాతం పింఛన్ల పంపిణీ శనివారమే పూర్తిచేయాలని, ఒకవేళ ఎవరైనా ఆరోజు అందుబాటులో లేకపోతే సెప్టెంబరు రెండో తేదీ సోమవారం అందజేయాలని సూచించారు.

# ముసురు

**నగరంలో మరో రెండు రోజులు ఇదే వాతావరణం**

- భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటన
- జీవీఎంసీలో కంట్రోల్ రూమ్

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత 24 గంటల నుంచి వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు చినుకులు పడుతూనే ఉన్నాయి. సాయంత్రం ఆరు గంటల సమయంలో భారీవర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ముసురు కారణంగా నగరంలో పారిశుధ్యం కొరవడింది. రహదారులు చిందరవందరగా మారాయి. రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్రలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. 31న ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారినందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా ప్రస్తుతం వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నందున, వర్షంలో తడవద్దని, అప్రమత్తంగా ఉండాలని వైద్య వర్గాలు సూచించాయి.



**నేలకొరిగిన చెట్లు**

గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. దీంతో బుధవారం రాత్రి 7 నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకూ గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**జీవీఎంసీ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు**

అల్పపీడనం ప్రభావంతో నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జీవీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. నగర ... మిగతా 6వ పేజీలో

# సీఐల బదిలీపై కొలిక్కిరాని కసరత్తు

- కొన్నాళ్ల కిందటే జాబితా సిద్ధం చేసుకున్న సీపీ
- వివాదాస్పద సీఐలను రేంజ్‌కు సరండర్ చేయాలని నిర్ణయం
- వారిలో కొందరిని నగరంలోనే ఉంచాలంటూ ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్లు
- పైగా కీలక పోస్టులను ఇవ్వాలని డిమాండ్
- అలాంటి వారికి పోస్టింగ్‌లు ఇవ్వలేక జాబితాను పక్కనపెట్టేసిన ఉన్నతాధికారి
- బదిలీల జాబితాను డీజీపీకి పంపినట్టు ప్రచారం




**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల అంశం ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఐల బదిలీలు జరుగుతాయని భావించారు. అప్పటి సీపీ రవిశంకర్ అయ్యన్నార్ సీఐల బదిలీలకు యత్నించారు. కానీ, ప్రజా ప్రతినిధుల సిఫార్సులు, ఒత్తిళ్ల నేపథ్యంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రెండు, మూడు స్టేషన్లకు సీఐలు లేకపోవడంతో అటాచ్‌మెంట్ మీద నియమించారే తప్ప, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. గత నెల ఎనిమిదిన సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టారు. నగరంలో పనిచేస్తున్న కొంతమంది సీఐలు సమర్థంగా విధులు నిర్వర్తించకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదని గుర్తించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐలతోపాటు విధి నిర్వహణలో సమర్థంగా పనిచేయలేకపోతున్నవారిని నగరం నుంచి రేంజ్‌కు సరండర్ చేసి, వారి స్థానంలో రేంజ్ నుంచి సమర్థులను తీసుకోవాలనుకున్నారు. ఇందులో భాగంగానే నగరంలో పనిచేస్తున్న సీఐలలో సుమారు 25 మందిని బయటకు పంపించేయాలని జాబితా సిద్ధం చేసుకున్నారు. అలాగే రేంజ్‌లో పనిచేస్తూ నగరంలో పనిచేసేందుకు ఆసక్తి వున్న సీఐల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. 30 మందికిపైగా నగరానికి వచ్చేందుకు సుముఖత వ్యక్తంచేశారు. ఇంతలో నగరం నుంచి ఎవరెవరిని బయటకు పంపనున్నారనే దానిపై పోలీస్ వర్గాల్లో చర్చ మొదలైంది. తమను నగరం నుంచి పంపించేయడం ఖాయమని గుర్తించిన కొంతమంది సీఐలు తమకు పరిచయం ఉన్న ప్రజా ప్రతినిధులను కలిసి నగరంలోనే కొనసాగించేలా చూడాల్సిందిగా కమిషనర్‌కు చెప్పించడం మొదలెట్టారు. జిల్లాకు చెందిన కీలక ప్రజా ప్రతినిధి ... మిగతా 6వ పేజీలో






## జోన్-4 కమిషనర్‌కు బదిలీ

**విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):** జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావుకు బదిలీ అయింది. శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.










ఏయూలో గిడుగుకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



లోకేశ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

# భాషా తపస్వి గిడుగు రామ్మూర్తి పంతులు

**» ఘనంగా తెలుగు భాషా దినోత్సవం**

**సీతంపేట, ఆగస్టు 29:** కళా ప్రపూర్ణ గిడుగు వేంకటరామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు తెలుగు భాషా విశిష్టతను మహనీయులు చేసినా కృషిని తెలియజేశారు. తెలుగు పద్యపీఠం అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ తెలుగు భాషా కృషికి ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మరడాన సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్ కుమార్, పరిశోధకులు స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌జీజీవోస్ కాలనీలో...**

**అక్కయ్యపాలెం:** గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస మాట్లాడుతూ విద్యతో పాటు వ్యాయామం, క్రీడలు అవసరమన్నారు. తెలుగు భాష ఉన్నతికి పాటుపడాలన్నారు. పాఠశాలలో చదివి జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడిగా రాణించిన ఎం.లోకేశ్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఎస్‌వీ విశ్వనాథ్, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్, మాణిక్యం, కిశోర్, శ్రీనివాసరావు, పద్మ, లలిత పాల్గొన్నారు.



33వ వార్డులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**పాలిటెక్నిక్ కళాశాలలో..**

**కంచరపాలెం:** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు భాషా ప్రాముఖ్యత, అభివృద్ధిని వివరించారు. మనిషి ఉన్నతికి ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదన్నారు. కవి పెంటకోట రామారావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు భాషాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంజీఎం పాఠశాలలో...**

**అల్లిపురం:** గ్రేటర్ 33వ వార్డు మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, ఎంఈఓ పుష్పరాగం తెలుగుభాషాభివృద్ధికి గిడుగు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం దిగ్గజహాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు.అప్పలరాజు, వినయ్‌గాంధీ, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

**బుల్లయ్య కళాశాలలో...**

**సీతమ్మధార:** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషను ఆస్వాదించాలన్నారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీకాంత్, పి.సురేఖ, అధ్యాపకులు పైడిరాజు, మాలతి, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇసరపు వాసు

**మహారాణిపేట, ఆగస్టు 29:** నగర పర్యటనలో ఉన్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు గురువారం వినతులు వెల్లువెత్తాయి. కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు గ్రేసుమార్కులు కలిపి, తక్షణమే తదుపరి పరీక్షలు నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు నిరుద్యోగ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు గ్రూప్ వన్ అభ్యర్థులకు 1:100గా మళ్లీ ఫలితాలు విడుదల చేసి మెయిన్స్‌కు అనుమతించాలని, గ్రూప్ 2 మెయిన్స్ తక్షణమే నిర్వహించాలని కోరారు. విశ్వ విద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు,

**విభిన్న ప్రతిభావంతులు**

**సీతంపేట:** విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ అధ్యక్షుడు ఇసరపు వాసు మంత్రి లోకేశ్‌కు వివరించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు తమకు అనుకూలమైన వారికి మాత్రమే నకిలీ వికలాంగుల ధ్రువపత్రాలు అందించి, పింఛన్లు మంజూరుచేశారని, అర్హులను గుర్తించి, అందరికీ పింఛను అందేలా చూడాలని కోరారు.

**రెడ్ బుక్‌ను ఇక్కడి నుంచే అమలుచేయాలి**

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో ఇంకా రెడ్‌బుక్ ఎక్కడని వైసీపీ నేతలు హేళన చేస్తున్నారని ఈ నేపథ్యంలో విశాఖ నుంచే రెడ్‌బుక్ రుచి ఏమిటో చట్టపరంగా అక్రమార్కులకు చూపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ కోరారు. నగర పర్యటనలో భాగంగా గురువారం మంత్రిని కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. మూడు రాజధానుల పేరుతో విశాఖలో భూదందాలు కొనసాగాయన్నారు. అనేక మంది బాధితులు తమ భూములను కోల్పోయి ఆవేదన చెందుతున్నారని ప్రస్తావించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా తమకు ఇంకా కష్టాలు తొలగిపోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఈ పరిస్థితుల్లో ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

## రక్షణ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సత్కరిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

**సీతమ్మధార, ఆగస్టు 29:** నగరానికి వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఐఎన్‌ఎస్ డేగా వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు.

## చవితి ఉత్సవాలకు ముహూర్తపు రాట

**అక్కయ్యపాలెం, ఆగస్టు 29:** న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ 35వ వార్షిక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఎన్‌టీ స్కూల్ రోడ్డులో రాట వేశారు. గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి అల్లూరి వీధిలో రియల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు మహూర్తపు రాట వేశారు. అల్లూరి అభినయ్‌రెడ్డి, పులి లోకేష్‌రెడ్డి, సాయి దినేష్ రెడ్డి, జగదీష్, హర్షవీర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చైతన్య, శ్యామ్, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

**అక్కయ్యపాలెం, ఆగస్టు 29:** రైల్వేన్యూకాలనీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం శ్రీనేత్ర ఐ కేర్, శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి, సంధ్య డెంటల్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిది. భక్తులకు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, సంధ్య డెంటల్ కేర్ ఆస్పత్రి వైద్యురాలు రేష్మ, అసిస్టెంట్ వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## సీఎల్ఎస్ యాప్‌పై అధికారులకు శిక్షణ

**డాబాగార్డెన్స్, ఆగస్టు 29:** పంటల్లో పురుగులు, తెగుళ్ల సూక్ష్మ పోషకాల లోపాల ఫొటోలు యాప్‌లో నమోదు చేసే విధానంపై అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు గురువారం అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జిల్లా శిక్షణ సంస్థలో సీఎల్ఎస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ హరికృష్ణ మాట్లాడుతూ యాప్‌లో 16 రకాల వ్యవసాయ పంటలు, రకాల ఉద్యానవన పంటలు నమోదు చేయవచ్చునని తెలిపారు. వ్యవసాయ అధికారి సురేష్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వైజాగ్ మాణిక్యంబిక, మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న అగ్రికల్చర్ అధికారులు

## 'రైతుబజార్లలో స్టాళ్లకు అద్దె లేకుండా చర్యలు చేపట్టాలి'

**సీతమ్మధార, ఆగస్టు 29:** రైతు అభివృద్ధిని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన రైతు బజార్లలో కనీస వసతులు మృగ్యమయ్యాయని విశాఖ మార్కెటింగ్ శాఖ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు పేర్కొన్నారు. సీతమ్మధారలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతు ప్రస్తుతం రూ.3 వేల విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. పంటను నష్టపోవడమే కాకుండా పండించిన కూరగాయాలు అమ్ముకునేందుకు స్టాల్‌కు రోజుకు రూ.100 చెల్లించడం కష్టమవుతోందన్నారు. రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలని, రైతులకు అద్దె రద్దుచేయాలని కోరారు. పెందుర్తిలో మరో రైతు బజార్ ఏర్పాటు చేయాలన్నారు.

## సందడిగా జాతీయ క్రీడా దినోత్సవం

**విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 29:** ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడారంగానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలను వివరించారు. రెండేళ్లుగా మహిళా కాలేజీ నుంచి జాతీయ విశ్వవిద్యాలయాల క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారిణులకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి, సమన్వయకర్త బి.సంతోషి అనూష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారిణికి బహుమతి అందిస్తున్న అధ్యాపకులు

**బుల్లయ్య కళాశాలలో..**

బుల్లయ్య కళాశాల క్రీడా విభాగంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడా విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ బిఆర్‌ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

**» సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ**

**అల్లిపురం, ఆగస్టు 29:** విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, నేరప్రవృత్తికి దూరంగా ఉంటూ శ్రద్ధగా చదువుకుంటే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని సీనియర్ సివిల్ జగ్జి వెంకట శేషమ్మ హితవు పలికారు. స్థానిక ఎంజీఎంసీ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల వినియోగం, నేర ప్రవృత్తి అంశాలపై విద్యార్థులకు ఆమె కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉపాధ్యాయులు, సమాజం పట్ల గౌరవభావంతో ఉండాలని, వారి మార్గదర్శకత్వంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏఈడీపీవో జి.శ్రీలత, సీహెచ్ ఝాన్సీలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ






# బిజీ బిజీగా యువనేత

... 5వ పేజీ తరువాయి

తరువాత కూడా కోర్టులోనే ఉండిపోయారు. అక్కడకు సమీపంలో బస్సులో మధ్యాహ్న భోజనం చేసి తిరిగి కోర్టుకు వచ్చారు. లోకేశ్ వెంట ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పార్టీ విశాఖ అధ్యక్షులు గండి బాబ్జీ, తదితరులు ఉన్నారు. కోర్టు పని ముగిసిన తరువాత బయట విలేకరులతో మాట్లాడారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో ఐటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. సుమారు రెండు గంటలసేపు సాగిన సమావేశంలో వారు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ మంత్రి ఓపికగా సమాధానం ఇచ్చారు. తరువాత గ్రాండ్‌బేలో ఐటీ పారిశ్రామికవేత్తలు ఇచ్చిన విందులో పాల్గొని రాత్రికి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు.

**భూకబ్జాదారులను వదిలేది లేదు: లోకేశ్**

నగరంలో భూ కుంభకోణాలకు పాల్పడిన వారిని వదిలేది లేదని నారా లోకేశ్ స్పష్టంచేశారు. కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు విశాఖలో వేల కోట్ల రూపాయల విలువైన భూములు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు అడ్డగోలుగా కొట్టేశారన్నారు. విశాఖలో కిడ్నాప్‌లు జరిగాయని, ఇంటికి పిలిపించుకుని బెదిరించి భూములు రాయించుకున్నారని ఆరోపించారు. విశాఖలో భూ కుంభకోణాలపై సిసోడియా విచారణ చేపట్టారని పేర్కొంటూ ఇక్కడ కబ్జాదారులపై చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు.

# సీఐల బదిలీపై కొలిక్కిరాని కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఒకరైతే ఏకంగా తాను సూచించిన వారిని నగరంలోనే ఉంచడంతోపాటు తాను చెప్పినచోట పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ సీపీని ఆదేశించినట్టు తెలిసింది. అలాంటి వారిని నగరంలో ఉంచి, కీలకమైన పోస్టులు కేటాయించలేక, అలాగని ప్రజా ప్రతినిధుల మాట కాదనలేక, సమర్థులని భావించేవారికి తన విచక్షణ మేరకు పోస్టింగ్‌లు ఇచ్చే పరిస్థితి కనిపించక..బదిలీల ప్రక్రియను పోలీస్ కమిషనర్ తాత్కాలికంగా పక్కనపెట్టేసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల నగర పర్యటనకు వచ్చిన డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి సీఐల బదిలీలు, రాజకీయ ఒత్తిళ్ల అంశాన్ని సీపీ తీసుకువెళ్లినట్టు అధికారులు కొందరు చెబుతున్నారు. తగిన సూచనలు ఇవ్వాలని కోరుతూ తాను తయారుచేసుకున్న జాబితాను డీజీపీ కార్యాలయానికి పంపించినట్టు సమాచారం. దీంతో సీఐల బదిలీల పక్రియపై పంచాయితీ ఇప్పుడు డీజీపీ కోర్టుకు చేరినట్టయిందని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

## 'కల్తీ ఆహారం అమ్మేవారి ఆస్తులను జప్తు చేయాలి'

**డాబాగార్డెన్స్, ఆగస్టు 29:** కల్తీ ఆహారం అమ్మేవారి ఆస్తులను జప్తుచేసి కేన్సర్ ఆస్పత్రులకు అప్పగించే విధంగా ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియాను మట్టుబెట్టాలన్నారు. ఆహార కల్తీని ప్రభుత్వాలు సమస్యగానే గుర్తించడం లేదన్నారు. మన దేశంలో కల్తీ ఆహారానికి సంబంధించి కఠిన చట్టాలు లేకపోవడంతో భవిష్యత్తులో కేన్సర్ రాజధానిగా నిలుస్తుందన్నారు. కల్తీ ఆహారంపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసేలా ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఫోన్ నంబర్లను మీడియా ద్వారా ప్రచారం చేయాలని కోరారు. దేవర శంకర్, ఎం.రవికుమార్, పి.సంతోష్‌కుమార్, కె.వెంకటేష్, బోలెం అశోక్ పాల్గొన్నారు.

# ఐటీ రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి


విమానాలు రావాలంటే నైట్ పార్కింగ్ చార్జీలు తగ్గించాలని సింబియోసిస్ సీఈఓ నరేశ్ కోరగా, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో తెలుగువారు ఎక్కువగా ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తామని లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగా ఐటీ స్పేస్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ రంగంలో ఇంకుబేషన్, కమ్యూనికేషన్స్ పెంచుతామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. కేవలం ఐటీనే కాకుండా ఫార్మా, ఎంఎస్‌ఎంఈ రంగాల్లోను విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్నదని, వారిని కూడా ప్రోత్సహిస్తామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ సెన్సస్ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. టాప్ 100 యూనివర్సిటీల్లో ఏపీ యూనివర్సిటీలు ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖకు విమానాల సంఖ్య పెంచాలని, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఐటీ పరిశ్రమలకు సెక్యూరిటీ, ట్రాన్స్‌పోర్టు, హైస్పీడ్ ఇంటర్నెట్ వంటివి కల్పించడం ద్వారా ఎకో సిస్టమ్ వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ చీఫ్ సెక్రటరీ సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరులో ఐటీ సంస్థలు నిర్వహిస్తున్న పది మంది విశాఖ పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి ప్రత్యేకంగా రావడం గమనార్హం.

# ముసురు

... 5వ పేజీ తరువాయి

ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు, ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీలుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసినట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నవారు, పునరావాసం కోసం ఎదురుచూస్తున్నవారు కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్ 18004250009కి ఫోన్ చేస్తే వెంటనే సహాయం అందజేస్తామన్నారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని కమిషనర్ వివరించారు.








జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పంచకర్ల

## దేవాలయం.. పార్టీ కార్యాలయం

**పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు**

**పెందుర్తి, ఆగస్టు 28:** ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని దేవాలయంగా భావిస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని రత్నగిరికాలనీలో నూతనంగా నిర్మించిన క్యాంప్ ఆఫీసు, జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ క్యాంప్ ఆఫీస్‌లో వారంలో ఒకరోజు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అయితి సింహాచలం, బలిరెడ్డి అప్పారావు, కె.రామునాయుడు, డీబీఎల్ నాయుడు, మధు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి దట్టమైన పొగ: భీతిల్లిన ప్రజలు

**మల్కాపురం, ఆగస్టు 29:** హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా దట్టమైన నల్లని పొగ రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హెచ్‌పీసీఎల్‌లో ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని భీతిల్లిపోయారు. దీంతో హెచ్‌పీసీఎల్‌లో ఏం జరిగిందంటూ స్థానిక విలేకరులకు పలువురు ఫోన్లు చేసి ఆరా తీశారు. అయితే వర్షాల సమయంలో హెచ్‌పీసీఎల్‌లో ఉన్న యూనిట్ల నుంచి వ్యర్థాలు అధిక మోతాదులో విడుదలవుతుంటాయి. ఆ సమయంలో దట్టంగా నల్లని పొగ వస్తుంటుంది. అయితే సాంకేతికపరమైన ఇబ్బందుల వల్లే ఇలా పొగ వస్తుంటుంది. కాగా వర్షాల సమయంలో వ్యర్థాలను ఎక్కువగా విడిచిపెట్టడం వల్లే పొగ వస్తుందనే వాదన కూడా ఉంది. ఏదిఏమైనా హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు జరుగుతున్నందున ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 63వ వార్డులో బోరింగ్ ప్రారంభం

**సింధియా, ఆగస్టు 29:** జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని చింతలలోవలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగును కార్పొరేటర్ గల్లా చిన్నా గురువారం ప్రారంభించారు. స్థానికుల అవసరాలకు ఈ బోరింగ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నరసింగరావు, పుక్కల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

**అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 29:** బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలోని మింది, గాజువాక 11కేవీ ఫీడర్లకు నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కారణంగా మింది, రామ్‌నగర్, గిరిప్రసాద్‌కాలనీ, రాజీవ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**అగనంపూడి, ఆగస్టు 29:** దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ధ్యాన్ చంద్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ బి.సతీశ్, పీడీ సీహెచ్ రాంబాబు, ప్రశాంత్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 25, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 23, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 36, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 525 |
| విజయనగరం | 529 |
| శ్రీకాకుళం | 529 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 88 |
| ఫారం ధర | -- | 108 |
| విత్ స్కిన్ | -- | 186 |
| స్కిన్‌లెస్ | -- | 196 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



గోపాలపట్నంలోని చంద్రనగర్‌లో పరదేశమ్మ ఆలయం వద్ద కూలిన చెట్టు



పెందుర్తిలోని పులగాలిపాలెంలో నేలకూలిన విద్యుత్ స్తంభం, విరిగిన చెట్టు



చంద్రనగర్‌లో రైల్వే ట్రాక్‌పై హెచ్‌టీ లైన్‌కు చిక్కుకున్న ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం

# వాన బీభత్సం

- ఈదురుగాలులకు పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- ఛిద్రంగా మారిన రోడ్లు
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పాదచారులు, వాహనదారులు



ఈదురుగాలులకు నార్త్ సింహాచలం రోడ్డులో కూలిన చెట్టు



గాజువాక వుడా కాలనీ రోడ్డులోని గోతుల్లో చేరిన వర్షపు నీరు



ఛిద్రంగా మారిన పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు



గాలులకు కాకానీనగర్‌లో నేలకూలిన చెట్ల కొమ్మలు



ప్రశాంతినగర్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

**గోపాలపట్నం, ఆగస్టు 29:** ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పలు చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా బుధవారం రాత్రి ఏడు నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకు ఈపీడీసీఎల్ గోపాలపట్నం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్తపాలెంలో పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సంబంధిత శాఖ అధికారులు బుధవారం రాత్రి నుంచే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా నేలకొరిగిన చెట్ల వల్ల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ సిబ్బంది గురువారం ఉదయం నుంచి చెట్ల తొలగింపు పనులను ముమ్మరంగా చేపట్టారు.

**పెందుర్తి:** ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పెందుర్తిలో విద్యుత్ శాఖకు అపారమైన నష్టం వాటిల్లింది. గాలుల బీభత్సానికి పలు విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో సిబ్బంది రాత్రి, పగలు శ్రమించి సరఫరాను పునరుద్ధరించారు. వర్షానికి ఈదురుగాలులు తోడవ్వడంతో ప్రశాంతినగర్, పులగాలిపాలెం, ముదపాక, జుత్తాడ, జంగాలిపాలెంలలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారమ్‌లపై చెట్లు విరిగిపడ్డాయి. పలు చెట్లు విద్యుత్ వైర్లపై పడడంత అవి తెగిపోయి సరఫరా నిలిచిపోయింది. అయితే ముందస్తు చర్యల్లో భాగంగా సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ఈపీడీసీఎల్ ఏఈ బి.రవి ఆధ్వర్యంలో ఇరవై మంది సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. రహదారికి అడ్డంగా పడిన స్తంభాలు, చెట్లను క్రేన్‌తో సహాయంతో పక్కకు తీసి వాహనాల రాకపోకలకు అడ్డంకులు లేకుండా చేశారు. విరిగిపడిన విద్యుత్ స్తంభాల స్థానంలో గురువారం ఉదయం నుంచి కొత్తవి వేసి పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా వేరే ఫీడర్ నుంచి తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేశారు.

**గాజువాక:** భారీ వర్షానికి పలు రోడ్లు బురదమయంగా మారడంతో పాటు రహదారులపై ఉన్న గోతుల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి వుడా కాలనీ రోడ్డులో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో అధిక శాతం రహదారులు అధ్వానంగా ఉండడం.. భారీ వర్షాల సమయంలో మరింత ఛిద్రంగా మారుతుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానాపాట్లు పడుతున్నారు.

**పెదగంట్యాడ:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పెదగంట్యాడ ప్రాంతంలోని పలు రహదారులు ఛిద్రంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపు నీరు తిష్ట వేయడం, కొన్నిచోట్ల రోడ్లు, డ్రైనేజీలు ఏకం కావడంతో డ్రైనేజీల్లోని వ్యర్థాలు, చెత్తాచెదారం రహదారులపై పెద్దఎత్తున పేరుకుపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఈ దుస్థితి నెలకొంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు భారీ వర్షానికి మరింత గోతులమయంగా మారాయి. పారిశ్రామికవాడ నుంచి పెదగంట్యాడ వెళ్లే రోడ్డు, అశోక్‌నగర్ నుంచి కొత్తదిబ్బపాలెం వెళ్లే రోడ్లు దారుణంగా తయారయ్యాయి. పెదగంట్యాడ నుంచి యాతపాలెం వెళ్లే ప్రధాన రోడ్డులో వాన నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. వర్షపు నీరు పక్కనే ఉన్న డ్రైనేజీలోకి వెళ్లేందుకు వీల్లేకుండా డెబ్రిస్ అడ్డంగా ఉన్నాయి. అయినప్పటికీ వేరే గత్యంతరం లేక పాదచారులు, వాహనదారులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గంగవరం పోర్టు రోడ్డు నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. ఇది తారు రోడ్డు అయినప్పటికీ ప్రస్తుతం మట్టి రోడ్డులా దర్శనమిస్తుంది. మహాత్మా గాంధీ కూడలి నుంచి గంగవరం వెళ్లే రోడ్డు, నడుపూరు-వుడా కాలనీ మధ్య రోడ్డు ఎక్కడికక్కడే గోతులమయంగా మారడంతో వాటిలో నీరు చేరింది. ఆయా రహదారుల మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

**ఆటోనగర్:** తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి పలు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇప్పటికే గోతులతో నిండిన రహదారులు వర్షానికి మరింత దారుణంగా మరాయి. ఉదయం వర్షంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు విధులకు వెళ్లే వివిధ సంస్థలు, కర్మాగారాల ఉద్యోగులు, కార్మికులు ఇక్కట్లకు గురయ్యారు. వర్షంతో ఫుట్‌పాత్ వ్యాపారాలకు విఘాతం కలిగింది. కాగా వర్షానికి ఆటోనగర్ నుంచి ఈ, ఎఫ్ బ్లాక్‌లలోని రోడ్లు బురదమయంగా మారాయి. యాదవజగ్గరాజుపేట, శ్రీనివాసనగర్, పకీరుతఖ్యా, చినగంట్యాడ రోడ్లలో ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా మాతృశ్రీనగర్‌లో గాలులకు ఓ చెట్టు విరిగిపడింది.

**ఎస్.ఎ.డి.జంక్షన్:** భారీ వర్షానికి 90, 52వ వార్డుల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎన్ఏడీ గణేశ్ నగర్, వుడా కాలనీ, సంజీవయ్య కాలనీ, ఎన్ఎస్‌టీఎల్ గేటు పరిసరాల్లో, ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డులోని ఎన్ఎస్‌టీఎల్ మలుపు వద్ద పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే వినోద్‌నగర్, సాకేతపురం, కాకానీనగర్, విమాన్‌నగర్ శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. గాలులకు వేంకటేశ్వరాలయం ముందు, నేవల్ గేటు, కాకానీ నగర్ ప్లేస్కూల్ వద్ద చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆయా చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద, సర్వీస్ రోడ్డులో రోడ్డులో మోకాల్లోతు వరకు వర్షపు నీరు నిలిచిపోయింది.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



మల్కాపురంలో గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి, తదితరులు

**మల్కాపురం, ఆగస్టు 29:** తెలుగు భాషను వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన దివంగత గిడుగు రామ్మూర్తిపంతులు అభినందనీయులని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సవర భాషకు వ్యాకరణాన్ని అందించిన మహోన్నత వ్యక్తి రామ్మూర్తి అని అన్నారు. గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రులు గర్వించదగిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని అన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ:** తెలుగు భాషను సరళీకృతం చేసిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులుకు దక్కుతుందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ఇక్కడి టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ములకలపల్లి పెంటయ్య, ఎన్.సోమరెడ్డి, కె.పైడిరాజు, అప్పలరెడ్డి, పి.శ్రీరామరెడ్డి, తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు లైబ్రేరియన్ పీవీ రమణ పూలమాల వేసి అంజలి ఘటించారు. పాఠకులు రాంబాబు, పురుషోత్తం, హరి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

**అగనంపూడి:** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి హెచ్ఎం ప్రసాద్, విద్యా కమిటీ ఛైర్మన్ అట్టా శ్రీనివాసరావు పూలమాలలు వేశారు. తెలుగు భాష గొప్పతనం గురించి వారు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, శారద, భూషణ్‌రావు, సత్యవేణి, శ్రీనివాస్, ఉమ, శాంతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల ఆందోళన




నినాదాలు చేస్తున్న ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు

**ఉక్కు టౌన్‌షిప్ 29:** తమకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. గురువారం ఉక్కు అడ్మిన్ భవనం వాద్ద వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘం ప్రతినిదులు మాట్లాడుతూ పరిపాలనా భవనంలో కష్టించి పనిచేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలన్నారు. టెండర్ ముగిసి 14 నెలలు గడుస్తున్నా కార్మికులకు ఫుల్ ఫైనల్ బెనిఫిట్ చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే వాటిని చెల్లించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీఎం చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, వేణురెడ్డి, అప్పారావు, రాజు, సీతారామ్, అప్పలరాజు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దు

ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు జె.శ్రీను హెచ్చరించారు. ప్లాంట్ ఉత్పత్తిలో సగభాగమైన కాంట్రాక్టు కార్మికుల్లో 30 శాతం మందిని తొలగించడానికి యాజమాన్యం చేస్తున్న యత్నాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని యాజమాన్యం కుట్ర చేస్తుందని, దీనిని తక్షణమే విరమించుకోవాలన్నారుజ కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, కృష్ణ, శ్రీనివాస్, నర్సింగ్, సోమేశ్, అప్పలరాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 'స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి'

**పెదగంట్యాడ, ఆగస్టు 29:** విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ గాజువాక శాఖ కార్యదర్శి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు డిమాండ్ చేశారు. ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్‌లో గురువారం జరిగిన మీటర్ రీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రానికి తలొగ్గి గతంలో వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చాక దానినే కొనసాగిస్తుండడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అంగీకరించబోమని ఎన్నికల ముందు ప్రకటించిన టీడీపీ ఇప్పుడు మాట తప్పిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గుప్తా, ఖాన్, రాజేశ్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

## కుంగిపోయిన రోడ్డుకు మరమ్మతులు



ప్రశాంతినగర్‌లో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**పెందుర్తి, ఆగస్టు 29:** పెందుర్తి సమీపంలోని ప్రశాంతినగర్ నుంచి బాలాజీనగర్ వరకు రూ.30 లక్షల వ్యయంతో మూడు నెలల కిందట వేసిన రోడ్డు బుధ

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

వారం కురిసిన భారీ వర్షానికి కుంగిపోయింది. రోడ్డు రెండుగా చీలి పెద్ద గొయ్యిగా మారడంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'మూడు నెలలకే రోడ్డుకు తూట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. ఇంజనీరింగ్ పబ్లిక్ వర్క్స్ ఏఈ శివరాం ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది తూట్లు పడిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఎక్సకవేటర్‌తో రోడ్డు లేయర్ తీసివేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు.

## రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలి

**అగనంపూడి, ఆగస్టు 29:** ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల పట్ల స్నేహపూర్వకంగా మెలిగి మెరుగైన వైద్య సేవలందించాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి సూచించారు. డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ గ్రేడ్ హెల్త్ (డీఎస్‌హెచ్) కమిషనర్ శిరీష బుధవారం ఆస్పత్రిని సందర్శించినప్పుడు ల్యాబ్ విభాగంలోని సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం ఆమె వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల పట్ల దురుసుగా మాట్లాడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ల్యాబ్‌కు వచ్చే రోగులకు సంబంధిత టెస్టులను చేయాలన్నారు. ప్రస్తుతం వైద్య సేవల్లో ఆస్పత్రి ఏ-గ్రేడ్‌లో ఉందని, ఆస్పత్రికి చెడ్డపేరు తీసుకువస్తే సహించబోమన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గాజువాక, ఆగస్టు 29:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు కోరారు. జోనల్ కార్యాలయంలో గురువారం జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో పింఛన్లు పొందని అర్హులను గుర్తించి వారికి పెన్షన్లు అందజేస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి పొందే విధంగా ప్రభుత్వం చేయూతనిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో యూసీడీ అధికారులు, పలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కణితి పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కార్ అవార్డు

**కూర్మన్నపాలెం, ఆగస్టు 29:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో అత్యంత ప్రతిభ చూపిన కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కార్ అవార్డు లభించింది. ఈ అవార్డును గురువారం ఏయూలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం బి.సూర్యప్రకాష్ అందుకున్నారు. తమ పాఠశాలకు ప్రథమ స్థానంలో అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే పాఠశాల పీడీ ఎం.మన్నాజీ జిల్లా స్థాయి బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అవార్డును కలెక్టర్, ఎమ్మెల్యేల చేతుల మీదగా అందుకున్నారు.

## 87వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్

**కూర్మన్నపాలెం, ఆగస్టు 29:** మలేరియా, డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది 87వ వార్డు శ్రీగణేశ్ నగర్‌లో గురువారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. అందరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించాలి

**ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 29:** గ్రేటర్ 90,91వ వార్డుల పరిధిలోని బాజీ జంక్షన్ నుంచి బెహరా ఆస్పత్రి వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై జరుగుతున్న వ్యాపారాలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరుతూ టౌన్ ప్లానింగ్, పోలీసు అధికారులు గురువారం వర్తకులకు అవగాహన కల్పించారు. జోన్-8 ఏసీపీ రఘునందనరావు ఆదేశాల మేరకు సచివాలయం, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీపీవో తేజ, ప్లానింగ్ కార్యదర్శి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

**పెదగంట్యాడ, ఆగస్టు 29:** ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల సమస్యలపై దృష్టి సారించి, వారికి వారికి న్యాయం చేయవలసిందిగా రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు నిర్వాసిత సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. విశాఖ నగర పర్యటనకు విశాఖ వచ్చిన మంత్రిని బుధవారం రాత్రి ఆయన ఎయిర్‌పోర్టులో కలిసి ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల సమస్యను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ములకలపల్లి పెంటయ్య, మొల్లి రమణ, మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## జోన్-4 కమిషనర్‌కు బదిలీ

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావుకు బదిలీ అయింది. శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.




ఏయూలో గిడుగుకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


లోకేశ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

# భాషా తపస్వి గిడుగు రామ్మూర్తి పంతులు

▸▸ ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

సీతంపేట, ఆగస్టు 29: కళా ప్రపూర్ణ గిడుగు వేంకటరామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు తెలుగు భాషా విశిష్టతను మహనీయులు చేసినా కృషిని తెలియజేశారు. తెలుగు పద్యపీఠం అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ తెలుగు భాషా కృషికి ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మరడాన సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్ కుమార్, పరిశోధకులు స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌జీజీవోస్ కాలనీలో...**

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస మాట్లాడుతూ విద్యతో పాటు వ్యాయామం, క్రీడలు అవసరమన్నారు. తెలుగు భాష ఉన్నతికి పాటుపడాలన్నారు. పాఠశాలలో చదివి జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడిగా రాణించిన ఎం.లోకేశ్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఎస్‌వీ విశ్వనాథ్, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్, మాణిక్యం, కిశోర్, శ్రీనివాసరావు, పద్మ, లలిత పాల్గొన్నారు.


33వ వార్డులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**పాలిటెక్నిక్ కళాశాలలో..**

కంచరపాలెం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు భాషా ప్రాముఖ్యత, అభివృద్ధిని వివరించారు. మనిషి ఉన్నతికి ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదన్నారు. కవి పెంటకోట రామారావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు భాషాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంజీఎం పాఠశాలలో...**

అల్లిపురం: గ్రేటర్ 33వ వార్డు మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, ఎంఈఓ పుష్పరాగం తెలుగుభాషాభివృద్ధికి గిడుగు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం దిగ్గజహాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు.అప్పలరాజు, వినయ్‌గాంధీ, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

**బుల్లయ్య కళాశాలలో...**

సీతమ్మధార: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జీ.మధుకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషను ఆస్వాదించాలన్నారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీకాంత్, పి.సురేఖ, అధ్యాపకులు పైడిరాజు, మాలతి, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇసరపు వాసు

మహారాణిపేట, ఆగస్టు 29: నగర పర్యటనలో ఉన్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు గురువారం వినతులు వెల్లువెత్తాయి. కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు గ్రేసుమార్కులు కలిపి, తక్షణమే తదుపరి పరీక్షలు నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు నిరుద్యోగ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు గ్రూప్ వన్ అభ్యర్థులకు 1:100గా మళ్లీ ఫలితాలు విడుదల చేసి మెయిన్స్‌కు అనుమతించాలని, గ్రూప్ 2 మెయిన్స్ తక్షణమే నిర్వహించాలని కోరారు. విశ్వ విద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు,

**విభిన్న ప్రతిభావంతులు**

సీతంపేట: విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ అధ్యక్షుడు ఇసరపు వాసు మంత్రి లోకేశ్‌కు వివరించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు తమకు అనుకూలమైన వారికి మాత్రమే నకిలీ వికలాంగుల ధ్రువపత్రాలు అందించి, పింఛన్లు మంజూరుచేశారని, అర్హులను గుర్తించి, అందరికీ పింఛను అందేలా చూడాలని కోరారు.

**రెడ్ బుక్‌ను ఇక్కడి నుంచే అమలుచేయాలి**

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో ఇంకా రెడ్‌బుక్ ఎక్కడని వైసీపీ నేతలు హేళన చేస్తున్నారని ఈ నేపథ్యంలో విశాఖ నుంచే రెడ్‌బుక్ రుచి ఏమిటో చట్టపరంగా అక్రమార్కులకు చూపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ కోరారు. నగర పర్యటనలో భాగంగా గురువారం మంత్రిని కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. మూడు రాజధానుల పేరుతో విశాఖలో భూదందాలు కొనసాగాయన్నారు. అనేక మంది బాధితులు తమ భూములను కోల్పోయి ఆవేదన చెందుతున్నారని ప్రస్తావించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా తమకు ఇంకా కష్టాలు తొలగిపోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఈ పరిస్థితుల్లో ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.



## రక్షణ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సత్కరిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

సీతమ్మధార, ఆగస్టు 29: నగరానికి వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఐఎన్‌ఎస్ డేగా వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు.

## సీఎల్‌ఎస్ యాప్‌పై అధికారులకు శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న అగ్రికల్చర్ అధికారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 29: పంటల్లో పురుగులు, తెగుళ్ల సూక్ష్మ పోషకాల లోపాల ఫొటోలు యాప్‌లో నమోదు చేసే విధానంపై అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు గురువారం అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జిల్లా శిక్షణ సంస్థలో సీఎల్‌ఎస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ హరికృష్ణ మాట్లాడుతూ యాప్‌లో 16 రకాల వ్యవసాయ పంటలు, రకాల ఉద్యానవన పంటలు నమోదు చేయవచ్చునని తెలిపారు. వ్యవసాయ అధికారి సురేష్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వైజాగ్ మాణిక్యంబిక, మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## 'రైతుబజార్లలో స్టాళ్లకు అద్దె లేకుండా చర్యలు చేపట్టాలి'

సీతమ్మధార, ఆగస్టు 29: రైతు అభివృద్ధిని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన రైతు బజార్లలో కనీస వసతులు మృగ్యమయ్యాయని విశాఖ మార్కెటింగ్ శాఖ కమిటీ మాజీ ఛైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు పేర్కొన్నారు. సీతమ్మధారలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతు ప్రస్తుతం రూ.3 వేల విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. పంటను నష్టపోవడమే కాకుండా పండించిన కూరగాయాలు అమ్ముకునేందుకు స్టాల్‌కు రోజుకు రూ.100 చెల్లించడం కష్టమవుతోందన్నారు. రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలని, రైతులకు అద్దె రద్దుచేయాలని కోరారు. పెందుర్తిలో మరో రైతు బజార్ ఏర్పాటు చేయాలన్నారు.

## సందడిగా జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడాకారిణికి బహుమతి అందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 29: ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడారంగానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలను వివరించారు. రెండేళ్లుగా మహిళా కాలేజీ నుంచి జాతీయ విశ్వవిద్యాలయాల క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారిణులకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి, సమన్వయకర్త బి.సంతోషి అనూష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**బుల్లయ్య కళాశాలలో..**

బుల్లయ్య కళాశాల క్రీడా విభాగంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడా విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



## చవితి ఉత్సవాలకు ముహూర్తపు రాట

అక్కయ్యపాలెం, ఆగస్టు 29: న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ 35వ వార్షిక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఎన్‌టీ స్కూల్ రోడ్డులో రాట వేశారు. గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి అల్లూరి వీధిలో రియల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ముహూర్తపు రాట వేశారు. అల్లూరి అభినయ్‌రెడ్డి, పులి లోకేష్‌రెడ్డి, సాయి దినేష్ రెడ్డి, జగదీష్, హర్షవీర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చైతన్య, శ్యామ్, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కయ్యపాలెం, ఆగస్టు 29: రైల్వేన్యూకాలనీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం శ్రీనేత్ర ఐ కేర్, శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి, సంధ్య డెంటల్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిది. భక్తులకు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, సంధ్య డెంటల్ కేర్ ఆస్పత్రి వైద్యురాలు రేష్మ, అసిస్టెంట్ వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

▸▸ సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ


విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

అల్లిపురం, ఆగస్టు 29: విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, నేరప్రవృత్తికి దూరంగా ఉంటూ శ్రద్ధగా చదువుకుంటే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ హితవు పలికారు. స్థానిక ఎంజీఎంసీ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల వినియోగం, నేర ప్రవృత్తి అంశాలపై విద్యార్థులకు ఆమె కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉపాధ్యాయులు, సమాజం పట్ల గౌరవభావంతో ఉండాలని, వారి మార్గదర్శకత్వంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏఈడీపీవో జి.శ్రీలత, సీహెచ్ ఝాన్సీలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.





# బిజీ బిజీగా యువనేత

... 5వ పేజీ తరువాయి

తరువాత కూడా కోర్టులోనే ఉండిపోయారు. అక్కడకు సమీపంలో బస్సులో మధ్యాహ్న భోజనం చేసి తిరిగి కోర్టుకు వచ్చారు. లోకేశ్ వెంట ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పార్టీ విశాఖ అధ్యక్షులు గండి బాబ్జీ, తదితరులు ఉన్నారు. కోర్టు పని ముగిసిన తరువాత బయట విలేకరులతో మాట్లాడారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో ఐటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. సుమారు రెండు గంటలసేపు సాగిన సమావేశంలో వారు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ మంత్రి ఓపికగా సమాధానం ఇచ్చారు. తరువాత గ్రాండ్‌బేలో ఐటీ పారిశ్రామికవేత్తలు ఇచ్చిన విందులో పాల్గొని రాత్రికి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు.

**భూకబ్జాదారులను వదిలేది లేదు: లోకేశ్**

నగరంలో భూ కుంభకోణాలకు పాల్పడిన వారిని వదిలేది లేదని నారా లోకేశ్ స్పష్టంచేశారు. కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు విశాఖలో వేల కోట్ల రూపాయల విలువైన భూములు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు అడ్డగోలుగా కొట్టేశారన్నారు. విశాఖలో కిడ్నాప్‌లు జరిగాయని, ఇంటికి పిలిపించుకుని బెదిరించి భూములు రాయించుకున్నారని ఆరోపించారు. విశాఖలో భూ కుంభకోణాలపై సిసోడియా విచారణ చేపట్టారని పేర్కొంటూ ఇక్కడ కబ్జాదారులపై చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు.

# సీఐల బదిలీపై కొలిక్కిరాని కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఒకరైతే ఏకంగా తాను సూచించిన వారిని నగరంలోనే ఉంచడంతోపాటు తాను చెప్పినచోట పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ సీపీని ఆదేశించినట్టు తెలిసింది. అలాంటి వారిని నగరంలో ఉంచి, కీలకమైన పోస్టులు కేటాయించలేక, అలాగని ప్రజా ప్రతినిధుల మాట కాదనలేక, సమర్థులని భావించేవారికి తన విచక్షణ మేరకు పోస్టింగ్‌లు ఇచ్చే పరిస్థితి కనిపించక..బదిలీల ప్రక్రియను పోలీస్ కమిషనర్ తాత్కాలికంగా పక్కనపెట్టేసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల నగర పర్యటనకు వచ్చిన డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి సీఐల బదిలీలు, రాజకీయ ఒత్తిళ్ల అంశాన్ని సీపీ తీసుకువెళ్లినట్టు అధికారులు కొందరు చెబుతున్నారు. తగిన సూచనలు ఇవ్వాలని కోరుతూ తాను తయారుచేసుకున్న జాబితాను డీజీపీ కార్యాలయానికి పంపించినట్టు సమాచారం. దీంతో సీఐల బదిలీల ప్రక్రియపై పంచాయితీ ఇప్పుడు డీజీపీ కోర్టుకు చేరినట్టయిందని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

## 'కల్తీ ఆహారం అమ్మేవారి ఆస్తులను జప్తు చేయాలి'

డాబాగార్డెన్స్, ఆగస్టు 29: కల్తీ ఆహారం అమ్మేవారి ఆస్తులను జప్తుచేసి కేన్సర్ ఆస్పత్రులకు అప్పగించే విధంగా ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియాను మట్టుబెట్టాలన్నారు. ఆహార కల్తీని ప్రభుత్వాలు సమస్యగానే గుర్తించడం లేదన్నారు. మన దేశంలో కల్తీ ఆహారానికి సంబంధించి కఠిన చట్టాలు లేకపోవడంతో భవిష్యత్తులో కేన్సర్ రాజధానిగా నిలుస్తుందన్నారు. కల్తీ ఆహారంపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసేలా ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఫోన్ నంబర్లను మీడియా ద్వారా ప్రచారం చేయాలని కోరారు. దేవర శంకర్, ఎం.రవికుమార్, పి.సంతోష్‌కుమార్, కె.వెంకటేష్, బోలెం అశోక్ పాల్గొన్నారు.

# ఐటీ రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

విమానాలు రావాలంటే నైట్ పార్కింగ్ చార్జీలు తగ్గించాలని సింబియోసిస్ సీఈఓ నరేశ్ కోరగా, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో తెలుగువారు ఎక్కువగా ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తామని లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగా ఐటీ స్పేస్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ రంగంలో ఇంకుబేషన్, కమ్యూనికేషన్స్ పెంచుతామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. కేవలం ఐటీనే కాకుండా ఫార్మా, ఎంఎస్‌ఎంఈ రంగాల్లోను విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్నదని, వారిని కూడా ప్రోత్సహిస్తామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ సెన్సస్ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. టాప్ 100 యూనివర్సిటీల్లో ఏపీ యూనివర్సిటీలు ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖకు విమానాల సంఖ్య పెంచాలని, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఐటీ పరిశ్రమలకు సెక్యూరిటీ, ట్రాన్స్‌పోర్టు, హైస్పీడ్ ఇంటర్నెట్ వంటివి కల్పించడం ద్వారా ఎకో సిస్టమ్ వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ చీఫ్ సెక్రటరీ సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరులో ఐటీ సంస్థలు నిర్వహిస్తున్న పది మంది విశాఖ పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి ప్రత్యేకంగా రావడం గమనార్హం.

# ముసురు

... 5వ పేజీ తరువాయి

ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు, ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వీలుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసినట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నవారు, పునరావాసం కోసం ఎదురుచూస్తున్నవారు కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్ 18004250009కి ఫోన్ చేస్తే వెంటనే సహాయం అందజేస్తామన్నారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని కమిషనర్ వివరించారు.

## నేడు భీమిలికి మంత్రి లోకేశ్ రాక

**భీమునిపట్నం, ఆగస్టు 29 :** రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ శుక్రవారం భీమిలి రానున్నారు. ఈమేరకు ఎంఈఓ శివరాణి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఆయన గొల్లలపాలెంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శిస్తారని,మధ్యాహ్నం 12.30 వరకు అక్కడ ఉంటారని చెప్పారు. కాగా గురువారం సాయంత్రం కేజీబీవీ విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావు విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ గంగాకుమారికి, ఎంఈవో శివ రాణికి పలు సూచనలు చేశారు.

## ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఏఓ

**పద్మనాభం (రూరల్), ఆగస్టు 29 :** మండలంలోని రైతులు వచ్చే నెల 15వ తేదీలోగా ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏవో ఎంపీ చలం చెప్పారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంట నమోదుతో పాటు రైతులు బయోమెట్రిక్ కూడా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు.

## 2 నుంచి బీజేపీ సభ్యత్వాల నమోదు

**పద్మనాభం (రూరల్),ఆగస్టు 29 :** బీజేపీ సభ్యత్వాల నమోదు వచ్చే నెల 2వ తేదీ నుంచి జరగనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాల నమోదుపై దృష్టిసారించాలని కోరారు.

**కొమ్మాది :** మధురవాడ ప్రాంతంలో 12 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి పుట్ట గంగయ్య పిలుపునిచ్చారు. మధురవాడలో సభ్యత్వాల నమోదుపై ఆయన కార్యకర్తలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మధురవాడ జోన్ అధ్యక్షుడు సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు ఉప్పిలి వంశీయాదవ్, భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామునాయుడు, కోకన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా కార్యదర్శి బండారు అనిల్, టి. ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పరికరాలు వితరణ

**భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 29 :** తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దివీస్ కర్మాగారం ప్రతినిధులు గురువారం రూ 2.25 లక్షల విలువైన క్రీడా పరికరాలను వితరణగా అందజేశారు. హెచ్ఎం సత్యనారాయణ చేతుల మీదుగా దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్ కుమార్ వీటిని విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ శారదకి నివాళి

**ఆరిలోవ, ఆగస్టు 29 :** భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం నాయకుడు డాక్టర్ జయగోపాల్ సహచరి, భారత నాస్తిక సమాజం మహిళా నాయకురాలు కామ్రేడ్ శారద నాల్గవ సంస్మరణ సభ గురువారం ఆరిలోవ కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు వైనూక రాజు మాట్లాడుతూ శారద తుది శ్వాస వరకు నాస్తిక సమాజం ఆశయాల కోసం పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు రవి, శ్రీరామ్మూర్తి, రమణి, విజ్ఞానంద్, సునీత పాల్గొన్నారు.

## ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా రామకృష్ణ

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యులు చల్లా రామకృష్ణ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సెంచూరియన్ వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

## క్లీనికల్ ఎంబ్రియాలజీ కోర్సు ప్రారంభం

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** ఏయూ ఫార్మసీ కళాశాలలో మాస్టర్స్ ఇన్ క్లీనికల్ ఎంబ్రియాలజీ కోర్సును వీసీ శశిభూషణరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంబ్రియాలజీ నిపుణుల అవసరం పెరుగుతోందన్నారు. సమాజ అవసరాలు, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆ కోర్సును ప్రారంభించడం పట్ల కళాశాల ఆచార్యులను అభినందించారు.

## సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 25, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 23, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 120, బరబటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 525 |
| విజయనగరం | 529 |
| శ్రీకాకుళం | 529 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 88 |
| ఫారం ధర | -- | 108 |
| విత్ స్కిన్ | -- | 186 |
| స్కిన్‌లెస్ | -- | 196 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ సిమ్మన్నను సత్కరిస్తున్న అధ్యాపకులు


పద్మనాభంలోని మద్ది గ్రామంలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

# తెలుగు భాషను కాపాడుకుందాం

- మాతృభాషా దినోత్సవంలో వక్తలు
- ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఘనంగా వేడుకలు
- కవుల వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

**భీమునిపట్నం, ఆగస్టు 29 :** తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. గురువారం భీమిలి, తూర్పు నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమిలిలోని పొట్టి శ్రీరాములు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సింహాచలం మాట్లాడుతూ తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి అనువదించిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అన్నారు. ప్రతిఒక్కరూ తెలుగు మాట్లాడడం, చదవడం, రాయడం నేర్చుకున్న తరువాతే ఇతర భాషలు నేర్చుకోవాలని చెప్పారు. అంతకముందు ఆయన గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నయీమ్, అల్లాడ శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ, కేటీవీ లక్ష్మి, మరగడ రామకృష్ణ, వైవీ రవికుమార్, అశోక్, సీఆర్‌పీ వంశీ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్, ప్రముఖ సాహితీవేత్త వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గ్రాంధిక భాషగా వున్న తెలుగును గిడుగు రామ్మూర్తి వాడుక భాషగా చేసిన కృషిని వివరించారు. అనంతరం సిమ్మన్న తాను రాసిన కొన్ని గ్రంథాలను కళాశాల గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. సిమ్మన్నను కళాశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, తెలుగు విభాగాధిపతి ప్రవీణ, అధ్యాపకులు శ్రీనివాసరావు, మాధురి, గౌరీశంకర్, అనురమ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**కొమ్మాది :** తెలుగు గొప్పతనాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని గాయత్రి విద్యా పరిషత్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ ఏటీకే రావ్ అన్నారు. రేవళ్లపాలెం, బక్కన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం చిన్నారులకు తెలుగు భాషపై పోటీలు నిర్వహించి, బహుమతులు ఇచ్చారు.

**మధురవాడ :** మధురవాడలోని పలు విద్యా సంస్థల్లోనూ తెలుగు భాషా దినోత్సవం జరిగింది. మాతృ భాష ప్రాధాన్యతను గుర్తించే విధంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పద్య పఠనంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు పలు వేషధారణతో అలరించారు.

**మద్దిలపాలెం :** తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగు దండు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదండు అధ్యక్షుడు ఫణిశయన సూరి, నరవ ప్రకాశరావు, కామేశ్వరశర్మ, చిన సూర్యానారాయణ, సూరప్పడు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయబాబు అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షుడు గొట్టపు సింహాచలాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కుసుమకుమారి, శారద, గోపాలనాయుడు పాల్గొన్నారు.

**సింహాచలం :** తెలుగు దేశ భాషలన్నింటిలో అగ్రస్థానంలో నిలుస్తుందని సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల హెచ్ఎం భాను అన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల ఆవరణలోని తెలుగు తల్లి, గిడుగు చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

**ఆనందపురం :** గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాలలోనూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయంలో నన్నయ్య నుంచి సి. నారాయణరెడ్డి వరకు కవుల చిత్రాలను ప్రదర్శించి, వారి గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే పద్య పఠన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. గాయత్రి డిగ్రీ కళాశాలలోనూ మాతృ భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు.

**వెంకోజీపాలెం :** ఏయూలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా తెలుగుతల్లి, గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ తెలుగు భాషా విశిష్టతను, తెలుగు భాషకు మహనీయులు చేసిన కృషిని వివరించారు. ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యా విహార్ స్కూల్లోనూ తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా విహార్ ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** విశాఖ వేలీ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా రత్న మీగడ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాష పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఇతర భాషలతో పాటు తెలుగును కూడా ఆదరించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

**పద్మనాభం :** మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన



**సింహాచలం, ఆగస్టు 29 :** వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడామండప ప్రదక్షిణ చేశారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పంతో పూజ జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం చేశారు.

## సహకార బ్యాంకును క్రెడిట్ సొసైటీగా మార్చాలి

**మధురవాడ, ఆగస్టు 29 :** మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని క్రెడిట్ సొసైటీగా మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు. 70 ఏళ్ల చరిత్ర గల ఈ సొసైటీలో 20 గ్రామాలకు చెందిన రైతులు సభ్యులుగా ఉన్నారు. అప్పట్లో వ్యవసాయదారులకు అవసరమైన రుణాలు ఈ బ్యాంకు ద్వారా ఇచ్చేవారు. కాలక్రమంలో మధురవాడ పరిసరాల్లోని వ్యవసాయ భూములు లేఅవుట్లుగా మారిపోవడంతో వ్యవసాయం కనుమరుగైంది. దీంతో ఈ సొసైటీ కొన్ని కార్యకలాపాలకు మాత్రమే పరిమితమైంది. ఈ సంఘాన్ని క్రెడిట్ సొసైటీగా మార్పు చేస్తే సాధారణ బ్యాంకు కార్యకలాపాలన్నీ కొనసాగుతాయి.

## రామ బాణాన్ని దర్శించుకున్న భక్తులు


రాముడి ధనస్సును, బాణాన్ని దర్శించుకుంటున్న భక్తులు

**భీమునిపట్నం, ఆగస్టు 29 :** అయోధ్యలోని రాముడి సన్నిధిలో ప్రతిష్ఠించనున్న శ్రీరాముడి ధనస్సు, బాణాన్ని గురువారం కృష్ణా కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. ముందుగా ఆలయ ప్రధానార్చకుడు అప్పలాచార్యులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంక్షేమ సంఘం పెద్దలు భక్తుల దర్శనార్థం ప్రధాన మండపంలో ధనస్సు, బాణాన్ని ప్రదర్శించారు. సాయంత్రం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయానికి వాటిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గాడు అప్పలనాయుడు, కె.ముత్యాలరావు, యోచ్చర్ల హరి, ఆనంద్, గొలగాని నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

## ఏయూను సందర్శించిన సైనికాధికారి

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** ఏయూను డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్ ప్రతినిధి కెప్టెన్ సందీప్ దాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ శశిభూషణరావుతో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

## 70 మందికి దంత వైద్య పరీక్షలు

**సింహాచలం, ఆగస్టు 29 :** జీవీఎంసీ 98వ వార్డు సింహాచలనగర్ (చాకిరేవుకొండ)లో నగరానికి చెం దిన సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్, గీతం డెంటల్ ఆసుపత్రి సంయుక్తంగా గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 70 మంది ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేసి, పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సుగ్గు బాలు, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మనోజ్, సందీప్, గణేష్, వెంకట్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే అదితి



**సింహాచలం, ఆగస్టు 29 :** విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతి వరాహలక్ష్మీనృసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆమెను ఆలయ మర్యాదలతో వైదిక బృందంతో కలిసి దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానించారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండప ప్రదక్షిణలు చేసిన అనంతరం అంతరాలయంలో అర్చకులు ఆమె గోత్రనామాలతో పూజ చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

## ఐటీడీపీ సభ్యులకు ప్రశంసాపత్రాలు


కార్యకర్తకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**భీమునిపట్నం, ఆగస్టు 29 :** నియోజకవర్గంలోని ప్రజలకు మన టీడీపీ యాప్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేరవేస్తున్న ఐటీడీపీ సభ్యులను, టీడీపీ నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్థానిక పార్టీ కార్యాలయానికి ప్రశంసాపత్రాలు పంపించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాటిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు చేతుల మీదుగా కార్యకర్తలకు గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు మరుపిళ్ళ రాజేంద్ర ప్రసాద్, కార్యకర్తలు నాగోతి శివాజీ, జేపీ రాజు, రాళ్ళపాటి వెంకటరావు, మైలపల్లి చిన కొర్లయ్య, బత్తిన శ్రావణ్, చెల్లపల్లి చిన్న పాల్గొన్నారు.

## 'మైనింగ్ తవ్వకాలపై గంటా వైఖరి తెలిపాలి'

**ఆనందపురం, ఆగస్టు 29 :** కుసులువాడ పంచాయతీలో మైనింగ్ తవ్వకాలకు అనుమతిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన వైఖరిని తెలియజేయాలని సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన వేములవలసలో విలేకరులతో మాట్లాడారు. మైనింగ్ తవ్వకాలపై చిన్నయ్యపాలెంలో బుధవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను స్థానికులు ఐక్యంగా ఎదురించారన్నారు. గత ప్రభుత్వం వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన మైనింగ్ జీవోలను అన్నిచోట్లా రద్దు చేసి ఇక్కడ మాత్రం రద్దు చేయలేదన్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఆయనతో పాటు సీఐటీయూ నాయకులు అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు ఉన్నారు.

## రెండు నెలల్లోనే రాష్ట్రంలో సుస్థిర పాలన

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** కూటమి ప్రభుత్వం రెండు నెలల్లోనే ప్రజలకు సుస్థిరమైన పాలన అందిస్తోందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు 1న సెలవు కావడంతో ఈనెల 31వ తేదీనే సామాజిక పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ చేసిన నిర్లక్ష్యం పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు ముప్పు తెస్తుందన్నారు. అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనీసం ఒక్క పరిశ్రమను కూడా తనిఖీ చేసిన ధాఖలు లేవని చెప్పారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను అథోగతి పాలు చేసి కూటమిపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

# వర్షానికి కూలిన చెట్లు


98వ వార్డులో ఇంటి గోడపై కూలిన చెట్టు

**సింహాచలం, ఆగస్టు 29 :** జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వార్డులోని పోస్టాఫీసు వీధిలో ఒక ఇంటి ఆవరణలోని టేకు చెట్టు కొమ్మ విరిగి పక్కింటి ప్రహరీ, విద్యుత్ వైర్లపై పడింది. ఆ సమయంలో అటువైపుగా ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సింహగిరిపై అన్నప్రసాద భవనానికి ఎదురుగా కూడా కొన్ని చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.

**కొమ్మాది :** శివశక్తినగర్ రోడ్డులో లక్ష్మీ టవర్స్ అపార్టుమెంట్‌లో బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. అపార్టుమెంట్‌పై పిడుగు పడడంతో పిల్లర్ దెబ్బతినడంతో పాటు కొన్ని ప్లాట్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి.

### భారీ వర్షంతో రైతుల్లో ఆనందం

**పద్మనాభం/ పద్మనాభం రూరల్ :** మండలంలో బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అనంతవరం, కొవ్వాడ పెంట, గంధవరం, రెడ్డిపల్లి,పొట్నూరు, చిన్నాపురం, అయినాడ, రేవిడి గ్రామాల్లో ఇప్పటికే ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. దమ్ములు పట్టినాట్లు వేసిన తరువాత కొన్ని రోజులుగా వర్షం లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే పంటలకు ఢోకా ఉందని చెబుతున్నారు.


నిర్మాణం పూర్తయి కల్యాణ మండపాల కాంప్లెక్స్

## ప్రారంభానికి సిద్ధంగా కల్యాణ మండపాల కాంప్లెక్స్

**సింహాచలం, ఆగస్టు 29 :** వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సాంకేతిక శాఖ మాస్టర్ ప్లాన్ ప్రకారం 98వ వార్డు శ్రీనివాసానగర్‌లో నిర్మించిన కల్యాణ మండపాల కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. వచ్చే నెలలో రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నాలుగేళ్లలో సుమారు రూ. 12 కోట్లు వెచ్చించి నాలుగు కల్యాణ మండపాలు నిర్మించారు. తొలుత రూ.8 కోట్లతో పనులు చేపట్టగా నిధులు చాలకపోవడంతో మరో రూ. 4 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం ముఖ ద్వారం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నగరంలో హిందువుల వివాహ శుభకార్యాలకు తక్కువ ధరకే వసతి కల్పించాలన్న లక్ష్యంతో ఈ కాంప్లెక్స్ నిర్మించారు. సింహగిరి పరిసరాల్లో మొత్తం 50 కల్యాణ మండపాలు నిర్మించాలని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచగా తొలుత ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద శ్రీదేవి కాంప్లెక్స్ పేరుతో దిగువన దుకాణాల సముదాయం, మొదటి అంతస్తులో నాలుగు కల్యాణ మండపాలు నిర్మించారు. ప్రస్తుతం వీటిని అప్పన్న దర్శనానికి వచ్చే యాత్రికులకు ఉచిత వసతి కేంద్రంగా వినియోగిస్తున్నారు.

## స్కూల్ గేమ్స్‌లో మూలకుద్దు పాఠశాలకు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం

**భీమునిపట్నం (రూరల్) :** మండలంలోని మూలకుద్దు కేథరిన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపడంతో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. ఈమేరకు గురువారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఏయూలోని న్యూ సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ విద్యార్థులకు బహుమతి అందించారు. విద్యార్థులు ఫుట్‌బాల్, కరాటే, బేస్ బాల్, నెట్ బాల్, సాఫ్ట్ బాల్ క్రీడల్లో ప్రతిభ చూపినట్టు పాఠశాల చైర్మన్ ఆలీవర్‌రాయి తెలిపారు.

## కనీస సదుపాయాలు లేని భైరవస్వామి ఆలయం

**సింహాచలం, ఆగస్టు 29 :** వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధాలయం భైరవస్వామి ఆలయానికి మౌలిక వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఈనెల 27న సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, డీఈఈ రామరాజు (హరి), తదితరులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి భైరవస్వామి ఆలయ ప్రత్యేకతలు, భక్తులకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చేనెల 3వ తేదీ నాటి శ్రావణ మాస బహుళ పక్ష అమావాస్య నాటి భక్తుల రద్దీకి తగ్గట్టుగా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడమే ప్రధాన సమస్య. ఇటీవల దేవస్థానం అధికారులు దాతల సాయంతో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, నీడనిచ్చే షెడ్‌లను అటవీ శాఖాధికారులు తొలగించి, ఆలయం వరకు వాహనాలు వెళ్లకుండా అప్రోచ్ రోడ్డు ప్రారంభంలో గేటు ఏర్పాటు చేసి తాళాలు వేశారు. దీంతో భక్తులు సుమారు రెండు కిలోమీటర్లు వరకూ నడచి ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో అధికారులు అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటే తప్ప భక్తులకు మౌలిక వసతుల ఏర్పాటు సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## జ్ఞాన సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని సీతమ్మధార ఎంఈవోలు రామారావు, బాలామణి, గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు మళ్ల వెంకటప్పారావు, బోర ధనరెడ్డి, కార్పొరేటర్ అప్పొరి శ్రీవిద్య, పాఠశాల హెచ్ఎం సీహెచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అస్వస్థతపై విచారణ జరపాలి

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** నూజివీడు ట్రిపుల్ ఐటీలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై ప్రభుత్వం విచారణ జరపాలని ఏబీడీఎస్‌ఓ నగర అధ్యక్షుడు కె. అభిలాష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు పెద్ద సంఖ్యలో అస్వస్థతకు గురైనా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వంటశాలల్లో అపరిశుభ్రత, నాణ్యతలేని ఆహార పదార్థాల వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

## ఇద్దరు బాలికలకు ఆర్థిక సహాయం

**వెంకోజీపాలెం, ఆగస్టు 29 :** కొత్త వెంకోజీపాలెం గ్రామానికి చెందిన కాళ్ల మహేష్ కుమార్తెలు హేమలత, దివ్య (7, 8 తరగతులు) చదువు నిమిత్తం శ్రీ సద్గురు శ్రీనాథ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు పి. రవితేజ, కాళ్ల అనిల్‌కుమార్ గురువారం రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మద్దాల నరసింహారావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఆడారి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి'


మాట్లాడుతున్న ద్రోణచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

**మద్దిలపాలెం, ఆగస్టు 29 :** యువత, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ద్రోణచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ క్రీడ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఒలింపిక్ పథకాలు సాధించే దిశగా పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు సంధ్యారాణి, శామ్యూల్ డేవిడ్ రాజు, విజయప్రతాప్, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**భీమునిపట్నం, ఆగస్టు 29 :** హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ తన అసమాన క్రీడా ప్రతిభతో భారతదేశ క్రీడా కీర్తి ప్రతిష్ఠలను శిఖరాగ్రానికి చేర్చారని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి అన్నారు. గురువారం ఆ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజిక్స్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ, స్పోర్ట్సు కమిటీ సభ్యుడు బి. ప్రసాదరావు, అధ్యాపకులు అనురమ, శ్రీనివాసరావు, మాధురి, అప్పలనాయుడు, పార్వతీదేవి, ఫిజికల్ డైరెక్టర్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

**ఆనందపురం :** శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలోనూ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముందుగా కళాశాల సిబ్బంది ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఆయన క్రీడలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ప్రసాద రాజు, ప్రిన్సిపాల్ శంభుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.